
ప్రజాశక్తి
మంగళవారం 29 జులై 2025 | 5 | అనంతపురం



తూముకుంట ఎస్‌బిఐకు కన్నం


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం రూరల్ మండలం తూముకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బిఐ బ్యాంకులో దొంగలు పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి బ్యాంకు వెనుకవైపు కిటికీ గ్రిల్స్‌కు కన్నం వేసి లోపలికి ప్రవేశించారు. గ్యాస్ కట్టర్ సాయంతో స్ట్రాంగ్ రూమ్, సేఫ్ లాకర్లను బద్దలు కొట్టారు. ఉదయం బ్యాంకును వెళ్లిన సిబ్బంది దొంగతనం విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బ్యాంకులో ఎంత నగదు, బంగారం అపహరణకు గురైందన్న విషయంపై పోలీసులు, బ్యాంకు అధికారులు గోప్యత పాటిస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని విలేకరులకు తెలిపారు. కాగా జన రద్దీ ఉండే ప్రాంతంలో ఉన్న బ్యాంకులో దొంగతనం జరగడం పోలీసు శాఖ వైఫల్యానికి అద్దం పడుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



దొంగిలించిన కిటికీ ఇనుప చువ్వలను పరిశీలిస్తున్న క్లూస్‌టీం

వార్త మెయిన్‌లో..

శింగనమల పంప్డ్ స్టోరేజీ రద్దు!



- అరబిందోకు చెందిన సంస్థ వెనుకడుగు
- 800 మెగా విద్యుత్ ప్రాజెక్టు ఇక లేనట్టే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పరిధిలో మంజూరైన పంప్డ్‌స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ మేరకు సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. చాగళ్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయరుపై దీని నిర్మాణానికి 2022లో వైసిపి ప్రభుత్వం అరబిందో రియాల్టీ, అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు అప్పగించింది. రూ.6వేల కోట్ల పెట్టుబడితో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పరిధిలో 800 మెగావాట్లతోనూ, అవుకు రిజర్వాయరుపైనా మరో 800 మెగావాట్ల సోలార్ పంప్డ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టులో ఎటువంటి కదలికలేకుండా ఉంది.

అరబిందో సంస్థ నుంచి స్పందన లేక రద్దు

శింగనమలకు ఆనుకుని ఉన్న చాగళ్లు రిజర్వాయరుపై పంప్డ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసి పనులను 2022లో అరబిందో సంస్థకు కేటాయించారు. 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో నిర్మాంచాల్సిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు డిపిఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను రూపొందించాల్సి ఉంది. ఈ డిపిఆర్‌ను పరిశీలించే బాధ్యత సాంప్రదాయ ఇంధన వనరుల శాఖ పర్యవేక్షణలో ఆర్వీ ఇంజినీరింగు కన్సల్టెంట్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ డిపిఆర్ తయారీకి అవసరమైన నిధులను అరబిందోసంస్థ సమకూర్చాల్సి ఉంటుంది. అరబిందో సంస్థ డిపిఆర్ తయారీకి సహకరించే సంస్థ అయిన ఆర్వీ సంస్థకు రూ.2.91కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం చెల్లించాలని 2023 నుంచి 2025 ఏప్రిల్ వరకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా అరబిందో సంస్థ నుంచి స్పందన లేదు. దీంతో ఆ సంస్థ ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకొచ్చే అవకాశం లేదని భావించి ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. చెల్లింపుల్లో అసాధారణమైన జాప్యం జరిగినందున రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేగవంతంగా అర్జీలకు పరిష్కారం

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై ప్రజలు అందించే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో 560 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. గడువుతీరక ముందే సకాలంలో అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని తెలియజేశారు. జీరో పావర్టీ పి4పై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చేందుకు మార్గదర్శులను గుర్తించాలన్నారు. వ్యవసాయ శాఖ కింద రైతు సేవ కేంద్రాలలో ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుని, షాపులను సీజ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అడాప్షన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. డిసిహెచ్ఎస్ కార్యాలయం నుంచి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కేటాయించిన అంబులెన్స్ తాళాలు, రికార్డులను జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవ నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, సిపిఓ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ఆగస్టు 15 వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని తెలియజేశారు.

నేడు ఆన్‌లైన్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం

తొలివిడత ప్రాంగణం ప్రారంభం

జాతికి అంకితం : వైస్ ఛాన్సలర్ ఎస్ఎ.కోరి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రీయ విశ్వవిద్యాలయం తొలి విడత ప్రాంగణం జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్ఎ.కోరి తెలిపారు. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద నూతనంగా ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమవారం మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా అనంతపురంలో ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయం 2018 లో తాత్కాలిక భవనంలో ప్రారంభమైందని చెప్పారు. 2020లో విశ్వవిద్యాలయానికి జంతలూరు వద్ద స్థలం కేటాయించగా అక్కడ శాశ్వత భవన నిర్మాణాలు ఆరంభమయ్యాయని తెలిపారు. మౌలిక సదుపాయల కల్పనకు రూ.711 కోట్ల మంజూరవగా, మొదటి విడత కింద రూ.350 కోట్లు విడుదల చేశారన్నారు. 15 నెలల కాల వ్యవధిలో ఎస్టేట్ కార్యాలయ భవనం, అకడమిక్ భవనం, బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం నిర్మించడంతోపాటు విశాలమైన అంతర్గత రోడ్లు అన్నీ పూర్తి చేసినట్టు విసి వివరించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ప్రస్తుతం 1600 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. తొమ్మిది యూజి, 17 పిజి, ఆరు పిహెచ్‌డి, 15 డిప్లొమో ప్రోగ్రామ్‌లు నడుస్తున్నాయని తెలిపారు. మొత్తం ఐదేళ్లలో పూర్తివడానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణం పూర్తయిన తొలి విడత ప్రాంగణాన్ని ఆన్‌లైన్ ద్వారా అఖిల భారతీయ శిక్షా సంఘం నుంచి ప్రధానిమోడీ, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ముగిసిన ఇన్ఫోసిస్ శిక్షణ

అనంతపురం : అనంతపురం ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో ఇన్ఫోసిస్ కంపెనీ స్పాన్సర్ చేసే 15 రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ కంపెనీ అఫర్ చేసిన ప్రీమియర్ బ్యాంకర్ కోర్స్‌పై శిక్షకుడు ఎం.శ్రీకాంత్ విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్ఎవి.ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఏ.శ్రీనాథ్, ప్లేసెమెంట్ అధికారి ఎస్.సాయిరామ్, ఐసీటీ అకాడమీ ప్రతినిధులు ప్రశాంత్, ప్రవీణ్ కుమార్, మెంటార్స్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

31వరకు పంటల బీమాకు గడువు

ఆత్మకూరు : ఈనెల 31వ తేదీలోపు పంటలు సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్ జ్యోతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించుకునేందుకు ఇప్పటికే గడువు ముగిసినప్పటికీ ఈనెల 31వ తేదీ వరకూ మరోసారి గడువు పొడిగించినట్లు తెలిపారు.

యల్లనూరు : మండలంలో పంటలు సాగు చేసే రైతులు ఈనెల 31వతేదీలోపు వాతావరణ బీమా ప్రీమియం చెల్లించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మధుకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీనీ, దానిమ్మ, వేరుశెనగ, అరటి పంటలపై రణం పొందిన రైతులు బ్యాంకులోనే ప్రీమియం చెల్లించుకోవాలని సూచించారు.

గూగూడు హుండీమాయంపై తనిఖీలు

సిసి ఫుటేజ్‌లను పరిశీలించిన దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి-నార్పల

గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక హుండీ మాయం అయ్యిందంటూ ఇటీవల పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నాడు నాడు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆలయంలోని సిసి కెమెరాలను పరిశీలించారు. గూగూడు ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ, గ్రామస్తులతో మాట్లాడారు. పరిశీలన అనంతరం వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన తెలిపారు.

గూగూడు ఆలయంలో హుండీ మాయంపై వస్తున్న వార్తలపై ఇప్పటికీ ఇంకా స్పష్టత రావడం లేదు. వాస్తవాన్ని నిగ్గుతేల్చేందుకు వివిధ స్థాయిల్లో అధికారులు తనిఖీలు, పరిశీలనలు చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఆలయ కార్యనిర్వహధికారి సాకేతపురం శోభ విలేకరుల సమావేశం నిర్వహించి హుండీ మాయం కాలేదంటూ తెలియజేశారు. ఆ మరుసటి రోజు ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్పీ వెంకటేశులు ఆలయంలో సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి నాలుగు హుండీలని, ఆర్డీవో ఐదు హుండీలు ఏర్పాటు చేశామంటూ పాత్రికేయులకు తెలపడంతో హుండీ మిస్సింగ్ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఈ కోణంలో వాస్తవాలను పూర్తి స్థాయిలో బహిర్గతం చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తూనే ఉన్నారు.



ఆలయంలో సిసి టీవీల ఫుటేజీని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్

సిఎం చంద్రబాబుతో అన్నివర్గాలకు మోసం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబు అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. సోమవారం నగరంలోని 38, 39వ డివిజన్ల పరిధిలో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి మోసం చేసిన చంద్రబాబు మేనిఫెస్టోను వివరంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజల వద్దకు వెళ్తుంటే చంద్రబాబు మాటలు విని మోసపోయామని వాపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా వైసిపి హయాంలో 38వ డివిజన్ పరిధిలో రూ.2.5 కోట్లు, 39వ డివిజన్ పరిధిలో రూ.3కోట్లతో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు చింతకుంట మధు, ఖాజా, రఫీ, నాగరాజు, రియాజ్, పద్మావతి, నందిని, హిదయతుల్లా, సురేష్, పెద్దన్న, కాకర్ల శీనా, నాగార్జున, హరి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

నార్పల : ముఖ్యమంత్రి చంద్రబాబును నమ్మితే మోసం గ్యారెంటీ అని జెడ్పీ వైస్‌ఛైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ ఖాదర్‌వలి విమర్శించారు. సోమవారం మండల పరిధిలోని నడిమిదొడ్డి, చామలూరు, నిలువురాయి గ్రామాల్లో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీరాములు, నడిమిదొడ్డి, లక్ష్మీరెడ్డి, నాగలింగారెడ్డి, నిలువురాయి వెంకటేష్, చాములూరు సూర్యనారాయణ, దాడితోట బాషా, బాలనాగి బయన్న, అమీర్‌బాషా, గుత్తి గోపాల్‌రెడ్డి, బాలనాగి రామాంజనేయులు జిలాన్‌బాషా, భాస్కర్‌నాయుడు, రామాంజనేయులు, కేసేపల్లి రామాంజనేయులు, చిలముకూరి గోపాల్, ఈడిగ ఆదినారాయణ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం మండ పరిధిలోని శోదనపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. వీటితోపాటు తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. అంతేగాకుండా వచ్చేనెల నుంచి రైతులకు సాయంతోపాటు మహిళలకు ఉచిత బస్సు పథకాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇకపోతే గత వైసిపి పాలనలో వర్షాకాలంలో పోతురాజుకాలువ మీదుగా శోదనపల్లికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. అయితే తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే పోతురాజుకాలువ-శోదనపల్లి మధ్యలో ఉన్న నదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఈ వంతెన ద్వారా దాదాపు 12 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందన్నారు. వీటితోపాటు అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, అమ్మలదిన్నె శాలిని, గుత్తా ఆదినారాయణ, చితంబరిదొర, గుర్రం లక్ష్మీనారాయణ, మారుతీనాయుడు, అట్టే రామాంజనేయులు, ఏకిల ఆదినారాయణ, సత్యనారాయణ, అనిల్‌కుమార్, ఎం.ఆదినారాయణ, అట్టే శ్రీనివాసులు, డ్రిప్పు ఓబులేష్, మాసూలు చంద్రమోహన్, పుల్లయ్య, అట్టే శంకర, జానుకొండ శ్రీనివాసులు, చిన్న చౌడప్ప, ఎంపిడిఓ భాస్కర్, ఉపాధి ఎపిఓ భాగ్యలక్ష్మి, ఇసి దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న శోదనపల్లివాసులు

రాయదుర్గం మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు తయారు చేసిన డ్రాఫ్టును మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మురళీమోహన్ సోమవారం విడుదల చేశారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయం ముందు ప్రజల పరిశీలనార్థం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ ప్రాంతాలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ రూల్స్ 2018 మేరకు అనంతపురం హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 'అహుడా' పరిధిలో రాయదుర్గం పురపాలక సంఘం భవిష్యత్తు అవసరాలు దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు చెప్పారు. ఇది నివాస, పారిశ్రామిక, వాణిజ్య, మౌలిక, వ్యవసాయ రంగాలలో అభివద్ధి పథకాలను చేర్చుతూ పట్టణ దీర్ఘకాల వ్యూహాన్ని నిర్దేశిస్తుందన్నారు. పట్టణంలోని ప్రతి పౌరుడు పట్టణ ప్రణాళిక పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనిపై తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఆగస్టు 25వ తేదీలోగా తమకు తెలపాలన్నారు.

'తొలిఅడుగు'కు ప్రజాదరణ : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో ఈనెల 2వతేదీ నుంచి చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుండి ఊహించని ఆదరణ లభించిందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 83,547 కుటుంబాలు ఉండగా ఇప్పటికే 70,881 కుటుంబాలను కలిశామన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు రాబోవు నాలుగేళ్లలో చేయనున్న పథకాలను వివరించినట్లు తెలపిఆరు. సాధారణంగా ప్రజాప్రతినిధులు ప్రజల మధ్యకు వెళ్లేటప్పుడు చుట్టూ అధికారులు, పోలీసులను వెంటబెట్టుకుని వెళ్తారన్నారు. అయితే తాము కేవలం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్తే అపూర్వ స్పందన లభించిందన్నారు. ముఖ్యంగా గత ఐదేళ్ల జగన్ అరాచక పాలనను చూసి విసిగి వేసారిన ప్రజలు.. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వారికి ఆశాదీపంగా నిలిచిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా తల్లికి వందనం, పెన్షన్, గ్యాస్ సబ్సిడీ, మొదలైన పథకాలను అమలు చేశామన్నారు. వచ్చేనెలలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.35కోట్లతో తుంగభద్ర ఎగువ కాలువ మరమ్మతులు చేశామన్నారు. రూ.56 కోట్లతో వేదవతి నదిపై వంతెన నిర్మాణం, గోనబావి వద్ద ఆశ్రమ పాఠశాల నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ పేర సిమెంటు రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణం వంటివి చేపట్టామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ఘనంగా ఎస్‌కెయు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భువనవిజయ ఆడిటోరియంలో సైన్స్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఆంజనేయులు అధ్యక్షతన సోమవారం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి బి.అనిత యూనివర్సిటీలో కొలువైన వివిధ విభాగాల గురించి వివరించారు. ముఖ్యంగా పిఎం ఉషా, రూసా పథకాల కింద నిధులు వచ్చాయని, వాటితో వివిధ విభాగాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వాతావరణ శాస్త్ర అధ్యనాలు గురించి భౌతిక శాస్త్ర విభాగంలో ఇస్రో సహకారంతో జరిగే పరిశోధనలను కొనియాడారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లో నిర్వహించే పలు కార్యక్రమాలను వివరించారు. తాను డైరెక్టర్‌గా ఉన్నప్పుడు ఉమెన్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అనంతరం వివిధ ఆటల పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ మాజీ రెక్టార్ సిఆర్ విశ్వేశ్వరరావు, రెక్టార్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పిఆర్ఓ కె.రాజగోపాల్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న ఎస్‌కెయు విసి, అతిథులు

సంచార ఐసిటిసి వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మారుమూల ప్రాంతాలు, హెచ్ఐవి ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల బాధిత కోసం ఏర్పాటు చేసిన సంచార ఐసిటిసి వాహనాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సోమవారం స్థానిక కార్యాలయంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుని హెచ్ఐవి సంక్రమించే అవకాశం ఉన్న వ్యక్తులకు కౌన్సిలింగ్, పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, ఎన్‌హెచ్‌ఎం డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఎఓ గిరిజా మనోహర్, పిఎంఓ నాగన్న, డెమో త్యాగరాజు, హెచ్ఇఇఓ నాగరాజు, డిప్యూటీ హెచ్ఇఓ గంగాధర్, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ రమణ, మురళి, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, మొబైల్ ఐసిటిసి సిబ్బంది నరేంద్ర, రాజగోపాల్, విశ్వనాథ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



సంచార ఐసిటిసి వాహనాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ దేవి




అంధకారంలో ఉన్న పెద్దముష్టూరు ఎస్సీ కాలనీ

అంధకారంలో పెద్దముష్టూరు ఎస్సీ కాలనీ

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెద్ద ముష్టూరు ఎస్సీ కాలనీవాసులు అంధకారం మగ్గుతోంది. దాదాపు పది రోజుల నుంచి వీధిలైట్లు పని చేయకపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయాందోళకు గురవుతున్నారు. రాత్రి సమయంలో చిన్న పిల్లలు మొదలుకుని ముసలి వారి వరకూ బయట తిరగాలంటే జంకుతున్నారు. విష పురుగులు, పాములు, తేళ్లు వంటి విషకీటకాలతో ఎప్పుడేం జరుగుతుందో అని భయపడుతూ గడుపుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో వీధిలైట్లు వేసి అంధకారాన్ని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



అంధకారంలో ఉన్న వ్యక్తి

అమృత, కిరణ్మయి పాఠశాలలను సీజ్ చేయాలి

కలెక్టర్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల వినతి



సమస్యలను వివరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


భవన నిర్మాణాలు జరుగుతుండగానే రేకులషెడ్లలో తరగతి గదులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గార్లదిన్నె మండలంలోని అమృత విద్యాలయం, కిరణ్మయి పాఠశాలలను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణశర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. గార్లదిన్నె మండలంలో అమత విద్యాలయంలో ఓవైపు పర్మిషన్లు తీసుకోకుండా భవన నిర్మాణాలు చేపడుతూ మరోవైపు విద్యార్థులకు తరగతి గదులు నిర్వహిస్తున్నారన్నారు. అంతేగాకుండా స్కూలు బస్సులు కాకుండా ఆటోల ద్వారా విద్యార్థులను రవాణా చేయిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వెంటనే ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచపల్లి సూర్యప్రకాష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం : గుంతకల్లులోని సరస్వతి విద్యామందిర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో రాయదుర్గంలోని సరస్వతీ శిశు మందిర్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 400 మీటర్ల పరుగు పందెంలో అపూర్వ స్థాయి ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో మనోజ్ కుమార్ ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగు పందెంలో సాయిసన్నిధి ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఖోఖో పోటీల్లో రాయదుర్గం పాఠశాల జట్టు మూడో స్థానాన్ని సాధించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా అధికారులతో బహుమతులు అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కమిటీ అధ్యక్షులు ధనార్జన, కార్యదర్శి శివకుమార్, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, తదితరులు అభినందించారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

వైసిపి విద్యార్థి విభాగం నాయకులు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని ప్రభుత్వ వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా భవనాలు కూలిపోయే స్థితికి చేరుకున్నాయన్నారు. చాలా హాస్టల్లో ఒక్కో గదిలో 20 నుంచి 30 మంది విద్యార్థులు ఉంటున్న పరిస్థితి ఉందన్నారు. దీనికితోడు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదన్నారు. మెస్‌ఛార్జీలు చెల్లించకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురిందిందన్నారు. వెంటనే హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు షేక్ సుల్తాన్ అదం, కైలాష్, శ్రీనివాసులు నాయక్, నరసింహులు, సాకే చంద్రకళ, తిప్పలూరి సుధీర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి, నవీన్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్‌ను సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా హాస్టల్‌లో స్థితిగతులు, సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య, ట్రంకుపెట్లు, దుప్పట్లు, ప్లేట్స్, గ్లాసులు ఇవ్వలేదని విద్యార్థులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల సమస్యలను కలెక్టర్‌తోపాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం బిసి విభాగం జిల్లా అధ్యక్షులు దేవేంద్ర, జిల్లా కార్యదర్శి హరి, మహేష్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, బిసి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు చిన్నికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని ప్రోగ్రెస్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు హిరణ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో హాస్టల్‌ను ఆకస్మింగా తనిఖీ చేసి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో కనీసం మరుగుదొడ్డిలో నీటి సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. వీటితోపాటు హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రెస్ స్టూడెంట్స్ ఫెడరేషన్ కమిటీ నాయకులు సాయికుమార్, ప్రిన్స్, జాన్, కుళ్లాయిస్వామి, యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని బిసి బాలుర వసతి గృహాన్ని వైసిపి విద్యార్థి విభాగం నాయకులు సోమవారం సందర్శిఇంచి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు షేక్షావలి, తాలూకా అధ్యక్షులు ఎరుకల విజయ్, యువజన విభాగం తాలుక అధ్యక్షులు తలారి చరణ్, మున్సిపాలిటీ విభాగం అధ్యక్షులు దొడగట్ట మురళి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఇటీవల మంజూరు చేసిన విద్యాకిట్లు నాసిరకంగా ఉన్నాయన్నారు. వీటికితోడు కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించలేదన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించలేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల విద్యార్థి విభాగం కన్వీనర్లు, ఓంప్రకాష్, అజయ్, నవీన్, మహదేవ, రాజు, రమేష్, బాషా పాల్గొన్నారు.

ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలను చూపుతున్న సంసిద్ధ్ పాఠశాల ప్రిన్సిపల్ మధునిక, సిబ్బంది

అనంతపురం : ప్రకృతిని సంరక్షించడం అందరి బాధ్యత అని సంసిధ్ పాఠశాల ప్రిన్సిపాల్ మధునిక అన్నారు. ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విపి రాజన్న ఆధ్వర్యంలో సంసిధ్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

రాప్తాడు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళీ సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పంపు కొండప్ప, మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, రాష్ట్ర కురుబ సాధికార కమిటీ కన్వీనర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు

రాప్తాడు : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచు తిరుపాలు, ఎంపిడిఒ బుల్లే విజయలక్ష్మి, ఎంఇఒ మల్లికార్జున, కుళ్లాయప్ప, ఎస్ఎంసి ఛైర్మన్ శిరీషా, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఉపాధ్యాయినులు నందిని, సరస్వతి, సంజీవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని వినతి

రాప్తాడు : మండలంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని హిందూపురం పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి ధనుంజయ నాయుడు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండలం ఎస్సీ సెల్ కన్వీనర్ రొద్దం ముత్యాలు, ప్రసన్నాయపల్లి పంచాయతీకి ఇందిరమ్మ కాలనీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పాల్గొన్నారు.

వినాయకుని విగ్రహ ప్రతిష్టాపన

యల్లనూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.రాము ఆధ్వర్యంలో సోమవారం మహా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

రైతు పొలాన్ని కాపాడాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని వెస్ట్ గుంతకల్లులో రైల్వే శాఖ కబ్జా చేసిన రైతు పొలాన్ని రక్షించాలని బాధిత రైతు మురళి కోరారు. ఈమేరకు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కారం వేదికలో తహశీల్దార్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ రైల్వే గూడ్స్ ట్రాఫిక్‌ను నియంత్రించడానికి నక్కలదొడ్డి నుంచి వెస్ట్ గుంతకల్లు వరకూ నిర్మిస్తున్న నూతన రైల్వేట్రాక్‌కు 94 - బి 1 సర్వే నెంబర్లలోని భూమిని తన అనుమతి లేకుండా తీసుకుని పనులు చేపట్టారన్నారు. అంతేగాకుండా రైల్వే కాంట్రాక్టర్ లూజ్ లేయర్‌ను తొలగించి వ్యవసాయ భూములోకి వేశాడని వాపోయాడు. దీంతో భూమి వ్యవసాయానికి పనికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైతుకు జీవనాధారమైన భూమిని నాశనం చేయడం మంచిది కాదన్నారు. వెంటనే రైతుకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలను కలుపుకుని ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతుకు మద్దతు ఇచ్చిన వారిలో నాయకులు నాగరాజు, ఎస్ఎం బాషా, రాముడునాయక్, షాషావలి, తదితరులు ఉన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు

టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్



మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్

ప్రజాశక్తి-గుత్తి

తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరికీ తగిన గుర్తింపు లభిస్తుందని మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. సోమవారం మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో తొండపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ నంద్యాల శివశంకర్‌యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఛైర్మన్‌తోపాటు వైస్ ఛైర్మన్‌లు సుంకన్న, రమణతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆర్.రవి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిలో అన్ని సామాజిక వర్గాల కార్యకర్తలకు నామిటెడ్, పార్టీ పదవులు లభించాయన్నారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిన సమయంలో ఒకే సామాజిక వర్గానికి పని చేస్తారని తమకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. అయితే అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, సర్పంచులు పి.భరత్‌కుమార్, యు.రామలింగమయ్య, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు ఎస్.బర్ధివలి, ఎంకె చౌదరి, కార్యదర్శులు సాంబశివయాదవ్, మారుతీప్రసాద్, నాయకులు చిన్నరెడ్డి యాదవ్, మోడే శ్రీనివాసయాదవ్, డేగ మద్దిలేటి, వెంకటనారాయణ, ఎన్.గోవిందు, న్యాయవాది సోము, ఎస్.ఇసాక్, కోనంకి కృష్ణ, ఎ.గోవర్ధన్‌గౌడ్, చికెన్ శీనా, బి.రమేష్, కోన లక్ష్మణరావు, కిట్టాయాదవ్, రంగప్ప, రామాంజి, కెబి రామకృష్ణ, మాజీ సర్పంచులు ఎ.నరసింహులు, వెంకటరాముడు, శ్రీనివాస్‌చౌదరి, లక్ష్మీనారాయణమ్మ, తిరుపాలు, సొసైటీ సిఇఒ నరసింహులు, సిబ్బంది అంజి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

యాడికిలో 'తొలిఅడుగు'

యాడికి : మండల కేంద్రంలోని పెద్దగడి వీధి, పాండురంగ స్వామి గుడి వీధిలో మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆది, గోపాల్‌నాయుడు, బొట్టు నాగశేఖర్, తాండ్ర విక్రమ్, రవికుమార్‌రెడ్డి, మధురాజు, ఆదినారాయణ, బద్దెల రాముడు, గోపీ, సుభాన్ మహబూబ్‌బాషా, ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం

యల్లనూరు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని తహశీల్దార్ బి.రాము సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ విజిత, విఆర్‌ఒలు మన్మథరెడ్డి, సత్యనారాయణ, నరసింహములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు సూర్యప్రకాష్, గిరి



సమావేశంలో పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యార్థి ఉద్యమ వేగుచుక్క ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపట్టామని జిల్లా నాయకులు సూర్యప్రకాష్, తరిమెల గిరి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందసర్భంగా వారు మాట్లాడుతూ శింగనమల కేంద్రంగా విద్యారంగ సమస్యలపై అనేక ఉద్యమాలు చేశామని ముర్గు చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న బాలికల వసతి గృహాన్ని ప్రారంభించేలా, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, పాఠ్యపుస్తకాలు అందజేయాలని ఉద్యమాలు చేశామన్నారు. భవిష్యత్తులో కూడా మండలానికి సంబంధించి జూనియర్ కళాశాలకు ఆటస్థలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా, సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మండల కార్యదర్శిగా నవీన్, అధ్యక్షులుగా ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అమృతరాజ్, సహాయ కార్యదర్శిగా భాస్కర్‌తోపాటు ఏడుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు హర్ష, బాబు, కిరణ్, ఉదయ్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



ఉరవకొండలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-రాప్తాడు

మండల పరిధిలోని హంపాపురం రైతు సేవా కేంద్రంలో పిడిఎటిఎంఎ జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా భూసార పరీక్షలు ఎలా చేయాలి.. వాటి ఫలితాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల ఫలితాలను ఆధారంగా ఎరువుల వాడి అధిక పెట్టుబడిని తగ్గించుకోవచ్చన్నారు. అంతేగాకుండా భూమికి రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. అదేవిధంగా జీవన ఎరువులైన ట్రైకోడెర్మ విరిడి, సుడోమోనస్ వంటి ఎరువులు విరివిగా వాడాలన్నారు. వేరుశనగ పంటలో జొన్న, మొక్కజొన్న పంటలను కంచెలుగా వేయడం వల్ల చీడ, పీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య, ఎఇఒ రంజిత, సుజిత, బిహెచ్‌ఎ పావని, ఎంపిఇఒ రాధా, జిల్లా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రైతులు సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతు శిక్షణ కేంద్రం జిల్లా అధికారులు లక్ష్మీనరసింహులు, శైలకుమారి సూచించారు. సోమవారం ఉరవకొండ మండల పరిధిలోని చిన్నముష్టూరు, విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామాల రైతు సేవాకేంద్రాల్లో పర్యటించి భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు సాగు చేసిన పంటలకు సోకే చీడపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రామకృష్ణ, పెన్నయ్య, ఎఇఒలు కైలాస్, వెంకటనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది మెర్సీ, రైతులు బాలకృష్ణ, వన్నూరుస్వామి, వడ్డే చిన్న, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేసి అధిక దిగుబడిని సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ సూచించారు. సోమవారం స్థానిక రామలింగ వ్యవసాయ క్షేత్రంలో సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మూస పద్ధతిలో సాగు చేయకూడదన్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ కులశేఖర్‌రెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

9న రంగనాథస్వామి కళ్యాణం

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి కళ్యాణోత్సవం వచ్చేనెల 9వతేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం కళ్యాణానికి సంబంధించిన లగ్నపత్రికను అర్చకులు రాశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణమ్మ, మాజీ ఎంపిటిసిలు వెంకటనారాయణ, రాజన్న, అర్చకులు పలుకూరి రవికుమార్, సతీష్ శర్మ, నవీన్‌కుమార్, నిఖిల్, ఉదయ్ కుమార్, చేతన్, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ శివ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు తమ ఆధార్‌కార్డుతో వచ్చి ఫోర్ వీలర్లకు రూ.4వేలు, ద్విచక్ర వాహనాలకు రూ.వెయ్యి చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఉరుసు పోస్టర్ విడుదల

ఉరవకొండ : ఉరవకొండలో ప్రసిద్ధగాంచిన హజరత్ బీబీ జనబ్బీ అమ్మవారి ఉరుసుకు సంబంధించిన పోస్టర్‌ను టిడిపి సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు, స్థానిక దర్గా కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు పయ్యావుల శ్రీనివాసులును శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు.

ఆర్థికసాయం

బ్రహ్మసముద్రం : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని చెలిమేపల్లి గ్రామానికి చెందిన పూలకుంట రుద్రప్ప కుటుంబానికి టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా చెలిమేపల్లి గ్రామానికి చేరుకుని రుద్రప్ప భౌతికకాయానికి పూలమాల వేసి నివాళుర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బీమప్ప, ధనంజయ, పూజారి రుద్రప్ప, శాంతప్ప, తదితరులు పాల్గొన్నారు.

30న ఉమ్మడి జిల్లా మహాసభలు

అనంతపురం సిటీ : ఈనెల 30తేదీన నిర్వహించనున్న రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యు) 11వ ఉమ్మడి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు చరణ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ మహాసభల్లో విద్యార్థుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులు, మేధావులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు జిల్లా అధ్యక్షుడు చరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే సురేంద్రబాబు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారథి పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రజావేదికలో ఆర్‌డిఒ వసంతబాబు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, హౌసింగ్ డిఇ, ఎఇ, తహశీలార్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30వతేదీన మండల పరిధిలోని చాపిరి గ్రామంలో రాష్ట్ర మంత్రి పర్యటించనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేయడమే లక్ష్యమన్నారు. కావున ప్రతి మండలం నుంచి 2వేల మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, పక్కా ఇల్లు ఇవ్వాలని ఇచ్చేందుకు లక్ష్యంగా ఎంచుకోవాలన్నారు. ఇకపోతే మంత్రి పర్యటనకు అన్ని శాఖల అధికారులు వారికి సంబంధించిన నివేదికలను తీసుకురావాలన్నారు.

లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

గుత్తి : అనాధికారిక లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 30తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించిన ప్లాట్ల యజమానులు 90 రోజుల్లోపు దరఖాస్తు చేసుకుని తగిన రుసుం చెల్లించి భవన నిర్మాణాల అనుమతులకు సమస్యలు లేకుండా చేసుకోవాలన్నారు. సందేహాలకు కార్యాలయ పని వేళల్లో పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా జీవించాలి

బొమ్మనహాల్ : గ్రామాల్లో ప్రజలు సోదరభావంతో మెలిగి ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ నబిరసూల్ సూచించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఇటీవల మండల పరిధిలోని కలగాలని-మైలాపురం గ్రామాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొలగానహళ్లిలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, ప్రజలు సోదరుభావంతో మెలగాలన్నారు. ఆవేశాలకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

మంజునాథ స్వామి ఆరాధనోత్సవం

బెలుగుప్ప : తొలి శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో 51 ఆరాధన మహోత్సవాన్ని కన్నుల పండువగా సాగింది. ఇందులో భాగంగా స్వామివారికి సుప్రభాత సేవ, కలషస్థాపన, మహాగణపతి పూజ, అశ్వర్థ నారాయణస్వామి నాగదేవతలకు నవగ్రహ పంచామృత అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

నార్పల : సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేయాలని ఎంపిడిఒ మమతాదేవి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జరుగుతున్న పి.4 సర్వేలో గుర్తించిన కుటుంబాలను దత్తత తీసుకోవడానికి పంచాయతీల వారీగా ఎన్నారైలు, వ్యాపారవేత్తలు, భూస్వాములు తదితర సంపన్నులను గుర్తించేందుకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్దన్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈక్రాప్ బుకింగ్ వేగవంతం చేయండి : ఎడిఎ

అనంతపురం : అనంతపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో ఈ క్రాప్ బుకింగ్ పారదర్శకంగా వేగవంతం చేయాలని ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎడిఎ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారులతో ఈ క్రాప్ బుకింగ్ బుకింగ్, రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు, పంటల సాగు విస్తీర్ణం డ్రోన్ ద్వారా పురుగుమందులు పిచికారిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో రైతులకు అందుబాటులో ఉండేలా రైతు సేవా కేంద్రం సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు వ్యవసాయ పథకాలు రైతుకు చేరువ చేసే విధంగా మండల వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు శ్యాంసుందర్‌రెడ్డి, వెంకట్‌కుమార్, కృష్ణచైతన్య, శుభకుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి

గుత్తి : పట్టణంలోని క్రీడా మైదానం సమీపంలో 44 జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ వాల్మీకి శివ, వైసీపీ నాయకుడు ఎం.రంగస్వామి కోరారు. ఈమేరకు సోమవారం ఆర్అండ్‌బి ఎఇ అనిఫ్‌వలికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడా మైదానం వద్ద రెండు పాఠశాలల్లోని విద్యార్థులు ఉదయం, సాయంత్రం జాతీయ రహదారి దాటడానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చాలా మంది రోడ్డు ప్రమాదాలకి గురై గాయపడ్డారని తెలిపారు. ఇటీవల ఓ మహిళ రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిందని గుర్తు చేశారు. అనంతరం స్పందించిన ఆర్అండ్‌బి ఎఇ రహదారిని పరిశీలించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

38 సిలిండర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని పలు దుకాణాల్లో నిర్వహించిన విజిలెన్స్ అధికారుల దాడుల్లో దాదాపు 38 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. విజిలెన్స్ సీఐ సద్గురుడు, ఎస్‌ఐ వెంకటప్రసాద్, డీసీటీఓ సురేష్‌కుమార్, సీఎస్‌డీటీ దుర్గప్రసాద్ రెండు బృందాలుగా ఏర్పడి సోమవారం పలుచోట్ల దాడులు చేశారు. ఇందులో భాగంగా ఎర్రనేల కాలనీలో 28, హరిజన కాలనీలో 10 అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ప్రముఖ వైద్యుడు నరేంద్ర గుండెపోటుతో మృతి



ప్రజాశక్తి-అనంతపురం

కళ్యాణదుర్గానికి చెందిన ప్రముఖ వైద్యుడు, ప్రొఫెసర్ నరేంద్ర (53) సోమవారం తిరుపతిలో గుండెపోటుతో మృతిచెందారు. కళ్యాణదుర్గానికి చెందిన డాక్టర్ నరేంద్ర అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేశారు. ఈ మధ్యకాలంలో తిరుపతి రుయా ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో సోమవారం ఉదయం రుయా ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట నడుచుకుంటూ వెళున్న ఆయనకు ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే స్థానికులు రుయా అత్యవసర వార్డులో సిపిఆర్ చేసి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించే లోపు మృతి చెందినట్లు తెలిపారు. నరేంద్ర కుటుంబం హైదరాబాదులో ఉంటోంది. ఈయనకు భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన మృతికి జిల్లాలోని వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు యల్లప్ప, గంగాధర్, బండారు శంకర్, సాకే అమర్నాథ్, మన్నెపాకుల రమేష్, వైద్యశాఖ నాగన్న లక్ష్మన్న, శ్రీరాములు, నాగేంద్ర, రవీంద్ర, తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పుట్లూరు శిక్షణ ఎస్‌ఐగా రామకృష్ణ

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు శిక్షణ ఎస్సైగా రామకృష్ణ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకట నరసింహ చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో రామకృష్ణను నియమించడంతో పుట్లూరు పోలీస్‌స్టేషన్‌కు ట్రైనింగ్ ఎస్‌ఐగా వచ్చి బాధ్యతలు చేపట్టారు.